# య్యా(క్షీషిఖైయ్

(ప్రబుద్ధాంధ్ర : 1935 మార్చి)

ఉరిఖిలా నీగ్రో నాయకుడు. అతనికి నాకు మొదటిసారి పరిచయము చిత్రముగా నైనది. 'కివు' సరస్సు దగ్గఱ గుమ్మైన చెట్లపైని మాటు పెట్టి పులికై నేనెదురు చూచుచుంటిని. అది మసకవేళ. అనేక వనమృగములు దప్పికకై వచ్చుచు పోవుచున్నవి. రెండు మూడాడు సింహములు వచ్చినవి. నేను పులినే కొట్టవలెనని యాగితిని. ఇంతలో నా వెనుక భయంకరమైన ధ్వని యైనది. నేను వెనుతిరిగి చూచితిని. ఉత్తరాఫ్రికాలో కనిపించు బార్బరీ వానర మొకటి తీవ్రమైన యమ్ము చేత కొట్టబడి తత్క్షణమే పడిపోవుచుండెను. చెట్టుక్రిందికి జూచితిని. తలలో నీకలు, కట్టినవి ఆకుబట్టలు, గాఢోరస్కుడు నొక నీగ్రో వేటగాడు పరుగెత్తుకొని వచ్చుచుండెను. అతడు వచ్చి నన్ను దిగి రమ్మని సంజ్ఞ చేసెను. నేను దిగి వచ్చితిని. నాకు కొంచెము కొంచెము నీగ్రోభాష తెలియును. అతనికి కొంచెము కొంచెము ఫ్రెంచిభాష తెలియును. బార్బరీ వానరము నన్ను చూచి నామీద దుముక పోవుచున్నదనియు, అందుచేత అతడు దానిని విషలిప్త బాణముతో జంపెననియు, నిటువంటి చోట్ల మాటు పెట్టరాదనియు, 'బాబూన్', 'గిబ్బన్' మొదలైన వానరములు మనుజుల నూరకే యెదిరించు ననియు, వృక్షముల మీద గూడ మనిషి సురక్షితుడు కాడనియు జెప్పెను. మేమిర్వురము కలసిపోతిమి. నాటినుండి యురిఖిలాకును నాకును మైత్రి. ఉరిఖిలా విచిత్రపురుషుడు. నీగ్రో పల్లెలలో అడవిలో, వారి నీగ్రోజాతి వలెనే వేసము ధరించియుండును. పట్టణములలో బెల్జియనులవలె వేసము ధరించి మంచి నాగరకుని వలె సంచరించును.

నేను 'యాముయా' పట్టణమున నివసించుచుంటిని. యాముయా 'అరువిమి' నదియొడ్డున నున్నది. అరువిమి కాంగోనదికి శాఖానది, ఉరిఖిలా పట్టణమునకు వచ్చినపుడెల్ల నాతో కలసి మాటాడును. ఒకనాడు సాయంకాలము మేమిర్వురము నరువిమి యొడ్డున నడుచుచుంటిమి. కొంత దూరము పోయిన తరువాత నొక పెద్ద దిబ్బ యొద్ద నిలుచుండి యురిఖిలా రెండుచేతులు జోడించి,

యెదుటొమ్మున ఫాలమున శిరస్సున నద్దుకొని, మోకరించి వంగి, శిరసు నేల నాన్చెను. నే'నేమి'టని యడిగితిని. అతడు నేత్రములయందు సునిశితత్వము భాసింపగా 'య్యోర్హిషీఖెయ్ - య్యోర్హిషీఖెయ్' అన్నాడు. అతడన్నది నాకు తెలియలేదు. నేను అప్పుడడిగినను అతడు చెప్పునట్లు లేదు. అతడు దీర్ఘాలోచనపరుడై తలవంచుకొని రెండుచేతులు వీపు వెనుక కలిపికట్టి నడచుచుండెను. కొంతదూరము పోయిన తరువాత నతడు నావంక దిరిగి 'య్యోర్హిషీఖెయ్ నెఱుగవా?' యనెను. నేనెఱుగ నంటిని. అతడు 'హిషీఖెయ్ గొప్పకవి. మాభాషలో నతడు వ్రాసిన గీతములు చాలనున్నవి. అతడడవి పిట్ట. వాగులోని చేప. కాంగో బిడ్డ!" అనెను. నేను నీగ్రోభాషలో కొన్ని మధురములైన గీతములున్నవని యెఱుగుదును. నీగ్రోల గొంతులలో మహామాధుర్యమున్నది. వారి కొన్ని పాటలు, వారు పాడుచుండగా - వారి శరీరముల నైల్యము, వారి మొగములయందలి వికారము నున్నవా లేవా యనిపించుచుండును. నిజమునకు "నీగ్రోవారి సంగీతశక్తి వలన యూరపు దేశపు సంగీతమెంత వృద్ధి పొందినది?!" ఉరిఖిలా యిట్లని చెప్పెను "హిషీఖెయ్ మీ బెల్జియనుల నాగరికత గిట్టనివాడు. అతడు మొదటి నుండియు తన గీతములయందు మీ తెల్లవారి మార్గములు నిరసించుచుండెను. హిషీఖెయ్ నావలె మోటువాడు కాడు. అతడు ఫ్రెంచిభాష వ్రాయను, చదువను గలడు. అతడు తన గీతములు ఫ్రెంచిలిపిలో వ్రాసి, ఫ్రెంచిభాషలో వాని కర్థము వ్రాసి పత్రికలలో ప్రకటించుచుండెను. అతని గీతములు న్యాంగ్వే, న్యూ అంట్‌వర్పు, లొయాంగో మొదలైన పెద్ద పట్టణములలో కూడ చదువుచుండిరి. ప్యారీ నగరములో అతని గీతములయందు గొప్ప సానుభూతి కలిగెను. కాని కాంగో దేశమున మిషనరీలకు, నిచ్చటి పాలకులకు అతని ప్రబోధము గిట్టినది కాదు."

నేను నీకు అతని గీతములేవైన వచ్చునా యని యడిగితిని. అతడు 'వచ్చు' నని తలయూపెను. నే 'నొకటిపాడు' మంటిని. అతడు తన గొంతు మంచిది కాదనియు తన నోటబడి హిషీఖెయ్ మధురగీతములు పాడైపోవచ్చుననియు చెప్పి యిట్లనెను. కివు సరస్సు మీద కిస్సాలికా యనునొక సన్నని పిట్ట యెగురుచుండును. దానికూత మిక్కిలి సన్ననై యది యొక విచిత్రముగ నుండును.

కిస్సాలికా మరియొక సరస్సు మీద నెగురదు. ఇంకొకచోట నుండదు. ఈ 'ఇటురీ' (అరువిమి నది కింకొక పేరు) పది పరుగుల పైని సన్నగా నుండి యొక కొండలోయలో నొక రాతి బెజ్జమునుండి జారిపడును. ఆ పడునపుడు క్రిందనున్న చెట్ల కొమ్మలపై పడుచుండును. ఆ పడునప్పుడొక సన్నని ధ్వని కలుగును. కిస్సాలికా కూత యా ఇటురీ యాకులమీద పడు ధ్వనివలె నుండును....

కివుపై కిసాలికా, కివుపైని కిసాలికా
ఇటురి ఆకులపైన చిటిలిపడు కిసాలికా
ఫ్రాన్సుల తుపాకికై ప్రాణముల వదలెదవో
కివు నీట నీ శవము కువకువలు సేయునో
కివు మీది కిసాలికా, కివుపైని కిసాలికా
నీవు కివు కలసెదవు నేను కివు కలసెదను
మన తియ్యనగు పాట మాయమై పోవునా?
కివు మీది కిసాలికా, కివుపైని కిసాలికా
ఇటురి జొంపము మీద చిటిలిపడు సవ్వడుల
నీ నా మధురగీతి నిలిచియుండును లెమ్ము
కిపు మీది కిసాలికా, కివుపైని కిసాలికా..."

ఉరిఖిలా కంటితుదలయందు సన్నని నీటిబిందువులు కూడెను. అతడొక తన్మయత్వ స్థితిలో నుండెను. నేనతని బుజముపై చేయివైచి 'ఉరిఖిలా' యంటిని. అతడదిరిపడెను. నేను "హిషీఖెయ్ తరువాత కథయేమి?"టని యడిగితిని. ఉరిఖిలా మఱల చెప్పనారంభించెను.

"హిషీఖెయ్ దేవుడు. కాంగోనది యవతారమెత్తిన మూర్తి. అతనిని నశింపజేయుట యెట్లాయని తక్కిన వారందఱకు బుట్టెను. అందులో మా నీగ్రోలును చాలమంది యుండిరి. యాముయా కు క్రొత్త గవర్నరు వచ్చెను. ఆ రోజున హిషీఖెయ్‌ని మాట్లాడవలసినదని బలవంతపెట్టిరి. హిషీఖెయ్ మాట్లాడెను. అతడు వ్రాసిన కీర్తనలు కొన్ని పాడెను. వాని కర్థములు చెప్పెను. జనమెల్లరు తుపాకి వేసి నట్లుండిరి. ఆనాడు హిషీఖెయ్ కాంగో దేవతవలె మహా భయంకరుడయ్యెను. పడవలను తలక్రిందులు చేయు కాంగోనది వలె

నతడందఱి మనస్సులను తలక్రిందులు చేసెను. ఉన్నత ప్రదేశముల నుండి క్రిందికి లంఘించు కాంగో పాతముల వలె హిషీఖెయ్ అల్పభావముల మీదికి లంఘించెను. అతడు మాటాడినంతసేపెవ్వరును కదలలేదు. అందరు దిగ్భ్రాంతియో యానందమో యనుభవించుచుండిరి. నాడెవరి దారిని వారింటికి పోయిరి. మఱునాడు ఊరిలో కలకలము బయలుదేరెను. ఒకడు హిషీఖెయ్ గర్వియని, మఱొకడు హిషీఖెయ్ రాజద్రోహియని, ఇంకొకడు హిషీఖెయ్ గవర్నరును నిందించెనని, మఱొకడు హిషీఖెయ్ క్రైస్తవ మతమును తిట్టిపోసెనని నోటికొక మాటగా చెలరేగిరి. నిజమునకు హిషీఖెయ్ ఆనాడు తన పద్యములను జదివెను. వారి కర్థములు చెప్పెను. గవర్నరును బొగడెను. నీగ్రోల కవితాశక్తిని మెచ్చుకొనెను. అతడు చేసిన దింతమాత్రమే! హిషీఖెయ్ గొప్పవాడని, నీగ్రోజాతి సంప్రదాయము లనుసరిచువాడని, హిషీఖెయ్ కవితాశక్తి ముందు తామందఱు నిలువజాలమని, హిషీఖెయ్ మీద కత్తికట్టి క్రైస్తవులైన నీగ్రోలును పాలకులయందలి మిషనరీలును హిషీఖెయ్‌ని పత్రికలలో దూషించిరి. ప్రతి పత్రికలలోనను దొంగ హిషీఖెయ్ విప్లవకారుడు హిషీఖెయ్ అని వ్రాయ మొదలుపెట్టిరి. హిషీఖెయ్ వీనికి వేనికిని సమాధానములు వ్రాయలేదు. తరువాత నెలనాళ్ళకు హిషీఖెయ్ మీద పెద్దకేసు పెట్టిరి. హిషీఖెయ్‌ను పట్టుకొనుటకు రాజభటులు వచ్చిరి. హిషీఖెయ్ తానప్పుడొకపాట పాడెను. ఆ పాటలోని యర్థమిది....

"ఒక కట్టెల వాడడవిలో చెట్టు నఱకుచుండును. మఱొక చెట్టుకొమ్మ యతని తలమీద రెమ్మలానించి గాలి విసరుచుండెను. అతనికి చీదరయెక్కి విసుగుకొని యా కొమ్మను నఱకివేసెను.."

అతనిని రెండు మాసములు ఖైదులో నుంచిరి. తరువాత జామీనుమీద విడుదల చేసిరి. మా దేశములో ఖైదీలనగా మీరెఱుగుదురు కదా! ఖైదులో నుండి బయటకు వచ్చిన తరువాత హిషీఖెయ్ అస్థిపంజరమైపోయెను. అతనికి క్షయవ్యాధి కలిగెను. అతడు ప్రతిదినము సాయంకాలమున నెత్తురు గ్రక్కుకొనుచుండెను. అతడు రెండు నెలలు తీసికొని యొకనాడు చనిపోయెను. చివరి దినములలో నతడు వ్రాసిన గీతములు మా జాతినంతయు నుద్ధరించుచున్నవని యురిఖిలా కన్నులు పెద్దవి చేసి ఇటురీ నీటిమీద జూచుచుండెను. నేను

"ఉరిఖిలా! హిషీఖెయ్ కవిత్వము నాకు మఱియు వినవలెనని యున్నది. అతడు చివరి రోజులలో వ్రాసెనంటివే! అది యొక గీతమును పాడగలవా" యంటిని.

ఉరిఖిలా కన్నులలోనికి నీళ్ళు వచ్చెను.

"ఇటురి, ఇటురి!
ఒత్తిడి పొందకోయ్
నెత్తురు క్రక్కకోయ్
ఇటురి, ఇటురి!
కొండ ఖైదును వదలి
పిండునీరము ప్రిదిలి
ఇటురి, ఇటురి!
నా పాటలో కలసి
నాట్యమాడిన ఇటురి
ఒత్తిడి పొందకోయ్
నెత్తురు క్రక్కకోయ్
ఇటురి ఇటురి!

ఈ పాట యతడొకనాడు సాయంవేళ నెత్తురు క్రక్కుకొని ఇటురీ నదివంక జూచుచు గానము చేసెను.

నేను మనస్సులో " హిషీఖెయ్ యెంత సుకుమారకవి!" యనుకొంటిని. ఉరిఖిలా మఱలనిట్లు చెప్పెను. "ఇందాక నిలుచుండి నేను పూజ చేసిన చోట హిషీఖెయ్‌ని తగులబెట్టినాము. ఆ దారివెంట బోవుచున్నప్పుడు నీగ్రోయైన ప్రతివాడును హిషీఖెయ్‌యందు తన గౌరవము ప్రకటించిపోవలయును. హిషీఖెయ్ శరీరము మాత్రము మట్టిలో కలిసిపోయినది. అతని యాత్మ కాంగోనదిలో పోయి మఱల కలిసికొన్నది.

హిషీఖెయ్ చనిపోయిన తరువాత నీగ్రోజాతి మీద పాలకు లెక్కువ పగ సాధింపనారంభించిరి. మా పూజలు మా యాచారములు సర్వము నెడల విరోధభావ మెక్కువైనది. హిషీఖెయ్ అన్నచో ద్వేషము వెల్లడించిన మావారికతని గొప్పదనమపుడు తెలియుచున్నది. హిషీఖెయ్ కాంగోనదిమీద నొక పాట వ్రాసెను. ఆ పాట యిప్పుడు ప్రతి నీగ్రోయును బరుండక 'ముందొకమారు పాడుకొనిగాని నిదురపోడు.'

నేనా పాట పాడు మంటిని

"మెఱకలపై దూకే కాంగో
మెట్టలపై నుఱికే కాంగో
రాళులపై కదలే కాంగో
బుడగలుగా కట్టే కాంగో
నల్లని దేహపు కాంగో
తెల్లని బుడగల కాంగో
పడవలు విఱిచే కాంగో
కడవలు నించే కాంగో
కమ్మని పాటల కాంగో
జిమ్మను చలి కల కాంగో
నీగ్రో కాంగో, నీగ్రో కాంగో
చావని కాంగో, చావని కాంగో
నల్లని కాంగో, నల్లని కాంగో
మెట్టల దూకే కాంగో
మెఱకల ఉఱికే కాంగో"

నేనీ విచిత్రమైన కవితాఫక్కిలో కల యొక విచిత్రమైన వ్యంగ్యభావమును జూచి యాశ్చర్యపోయితిని. ఉరిఖిలాయును నేనును బయలుదేరితిమి. ఉరిఖిలా తన పల్లెటూరికి నన్ను రమ్మని యాహ్వానము చేసెను. ఇరువురము పోవుచుంటిమి. అడవిలో బడి నడుచుచుండగా నొకరొకరము మాటాడుకొనలేదు. కొంతదూరము పోయిన తరువాత చీకటి పడినది. సూర్యాస్తమయము కాకముందే అడవిలో చీకట్లు బలిసినవి. ఉరిఖిలా ప్రక్కనున్నంతవఱకు నా కడవి జంతువుల వలన భయములేదు. చీకట్లు బాగుగా ముసరినవి. ఉరిఖిలా పల్లె మఱి రెండు మైళ్ళ దూరమున్నది. దారిలో నొక చిన్న చెఱువున్నది. దానిపై నొక పిట్ట సన్నని కూత కూసినది. ఆ ధ్వని వినినంతనే యురిఖిలా.

"కివు పై కిసాలికా
కివు పై కిసాలికా
ఉరిరి కిరు కొరితె
కుయ్ః ఖెలితె కిసాలికా"

అని గంతులు వేయ నారంభించెను. ఉరిఖిలాకు డెబ్బది యైదేండ్లు వయసుండవచ్చును. అతడు లేడిపిల్లవలె చెంగుచెంగున దూక నారంభించెను. నేనతని నందుకొనలేకపోతిని. నేను దూరమునుండి యురిఖిలా యని కేకపెట్టి పిలిచితిని. అతడు నా యొద్దకు మఱల దుముకుచువచ్చి పగలబడి నవ్వెను. చేయి యాకాశము వంక జూపించి యొక యీల వేసి 'కివు పై కిసాలికా కివు పై కిసాలికా' యని యఱచెను.

అతని పల్లెకు కాలిత్రోవ దూరము. దట్టమైన యడవిలో నుండి దగ్గఱ త్రోవయున్నది. అతడా త్రోవ తీసెను. కొంతదూరము పోవుసరికి బొంయిమని పెద్దధ్వని వినిపించెను. ఒక వందమంది జనము పెద్దగా నఱచుచుండిరి. ఉరిఖిలా నది యేమిటని యడిగితిని. అతడిట్లు చెప్పెను. అచటికి దగ్గఱలో ఇటురీ నదిలో కలియు నొక పెద్ద వాగుండెను. అది యా సమీపమున బెద్ద తటాకము కట్టి మిక్కిలి లోతుగా నుండును. అందు మొసళ్ళు, నీటి గుఱ్ఱములు నివసించుచుండును. నీటి గుఱ్ఱమును వేటాడుట మిక్కిలి భయంకరమైన విషయము. నీగ్రోజాతి వారుచ్చులు పోసి పొదల వెనుక దాగియుండి యా యుచ్చులు నీటిగుఱ్ఱము కాళులకు తగిలించి బిగించి, దానిని వెలికిల ద్రోసి వలలలో దానిని సంగ్రహింతురు. అది చెదిరిపోయెనా నీగ్రోల నందఱను విఱుగత్రొక్కును. దాని దీర్ఘదంష్ట్రల నడుమ కసబిస నమలివేయును. దానిని వేటాడుట మహాకార్యము. ఉరిఖిలా తన పల్లెవారు నీటి గుఱ్ఱమును బట్టుకొని యుండిరని చెప్పెను. నేనది చూడవలయు నంటిని. మేమిర్వుర మచ్చటికి బోతిమి. వంద కాగడాల వెలుగులో వెల్లకిల బడి చావు బ్రతుకుల మధ్యనున్న యా మహాజంతువు పడియుండెను. అన్నివైపుల వలలు పట్టుకొన్నవారు, దాని కాళులకు బిగించిన పగ్గములు పట్టుకొన్నవారు ఆ జంతువును కదలకుండ జేయుచుండిరి.

రాత్రి రెండుజాములకు ఉరిఖిలా పల్లె చేరితిమి. రాతిరి నిదురబోవుచు ఉరిఖిలా హిషీఖెయ్ వ్రాసిన కాంగోపాట పాడి నిదురించెను.